


గుమ్మంముందు టాక్సీ సిద్ధంగా ఉంది.

ముందు వరండామీద లెదర్ సూట్‌కేసు, హోల్డాలు అంతకుముందే సిద్ధంగా ఉన్నాయి.

ఏ స్త్రీ చెయ్యలేని సాహసం చేస్తోం దామె.

పరువపు కత్తిమీద సాము చెయ్యటానికి పుట్టింటికి వెళ్లిపోతూంది అతడి హృదయదేవత!

ఆదర్శప్రాయమైన ఉత్తమ హైందవ సంప్రదాయం, సంస్కార బాధ్యతాయుతమైన ఉన్నత సాంఘిక జీవనం — ఈ రెండూ ఆమెను ఆ సాముకు సిద్ధం చేశాయి. తన ఆరాధ్యదైవానికి దూరం చేస్తున్నాయి.

ఆమెకు ఇరవై రెండు వసంతాలు నిండాయి.

పరవళ్లు తొక్కుతూన్న నదీజలాలు, తాడిఎత్తున పైకి లేచి పడే కడలి తరంగాలు ఆమె పరువం! ఆమె అంగపుష్టిలో ఆ పరవళ్ల ఉద్వృత్తం కనిపిస్తుంది, ఆమె అవయవ సౌష్ఠవంలో ఆ తరంగాల హోరు వినిపిస్తుంది!

ఆమె సగటు ఎత్తు మనిషి. ఎత్తుకు తగిన పొళ్ళలో పుష్టిగా ఉన్న ఒళ్ళు. ఆ ఒళ్ళు వన్నెను చూసి బంగారం చిన్నబుచ్చుకుంటుంది!

గుండ్రటి మొహం ఆమెది. లాగిపట్టిన విల్లు లాంటి చక్కని కనుబొమలు. లేత రావియాకును బోలిన కళ్ళు. చిలక ముక్కులా చివరన అందంగా కొంచెం వంపు తిరిగిన నాసిక. ఆపిల్ చెక్కిళ్ళు.

ఆమెది భూలోకం కాదు!

ఎరండా మధ్యలో . . . సామాన్ల పక్కన ఉన్న స్తంభంమీద ముంజేతిని అడ్డంగా ఆనించి, దాని మీద నుదురును మోపి, తెల్లని పైజామా, పల్చని గ్లాస్కో లాల్చీ తొడుక్కుని, ఒడ్డుగా, పొడుగ్గా వింతైన విగ్రహం కల. . . అతను కుమిలిపోతూ నుంచున్నాడు.

గదిలో ఆమె . . . పైకి పెల్లుబికి వస్తూన్న దుఃఖాన్ని దిగమింగుకోవటానికి విశ్వప్రయత్నంచేసి విఫలురాలై, నోట్లో పమిటకొంగు కుక్కుకుని, వెక్కివెక్కి ఏడుస్తూంది.

అది వినిపించిన అతడు దహించుకుపోయాడు.

'తనొహ విష్వుకర. తాను కాలిపోతూఉంటాడు. తనను నమ్మి చేరిన వాళ్ళను కాల్చిపారేస్తూ ఉంటాడు.

ఇలా పరిణమిస్తుందని అప్పుడు ఊహించుకోలేక పోయాడు తను. నిజానికి పరిణామాలకు సంబంధించిన ఊహాలను దరి రికి రానిచ్చే ఘడియ కా దది. తనకు ఒళ్ళూ పై తెలీని సమయం అది. అప్పటి తన ఆవేశం అంతటిది. ఆ ఘడియు, ఆ ఆవేశం కలిసి తనను అశక్తుణ్ని చేసి పారేశాయి. దాని ఫలితం ఈనాడు ఇలా పక్రికించింది.

ఆవేళ కనీసం పహీదా అయినా తనను వారించి ఉంటే, ఇంతవరకూ వచ్చేదికాదు. ప్చ్! . . . ఇలా అవుతుందని ఆమె కలలోకూడా అనుకుని ఉండదు. తనమీద ఆమె కెంత సద్భావం!

తనమూలంగా ఇప్పుడు పువ్వుల్లాంటి హృదయాలలో నిప్పుల్లాంటి క్షోభ రాజుకుంటూంది. ఎంత పాపిష్టి వాడు తను! ఎంత ౼ష్ట్యం ఉంది తనలో!'

రెక్కలు కాలిన దీపంపురుగులా విలవిల్లాడి పోతున్నాడు పార్థసారథి.

'పెళ్ళినాడు పాదాలకు పూసిన పారాణి అనవాళ్ళు ఇంకా పాదాల నుండగానే నా కీ ఇంటితో ఋణం తీరిపోతూంది!'

అవనత శిరస్కయై, గది గడప దాటి, ముందు వరండాలో భారంగా పాదం పెడుతూన్న వసంత గుండెల్లోంకి దుఃఖం ఒక్కసారిగా వెల్లువలా పొంగుకు వచ్చింది. పమిటకొంగుతో కళ్ళు ఒత్తుకుంది.

వసంతవైపు తల తిప్పి చూశాడు పార్థసారథి.

తెల్లని ఖద్దర్ చీర, లాన్ జాకెట్ . . . ధవళ కాంతులీనుతూన్న ఆ దుస్తుల్లో వసంత ఒళ్ళు అప్పటి కప్పుడు మెరుగుపెట్టి తెల్లని ఉల్లిపొర కాగితంలో చుట్టిన సరికొత్త బంగారు ఆభరణంలా శోభిస్తూంది.

'బాహ్యసౌందర్యం, హృదయసౌందర్యం — ఏ ఒక్కరికీ ఇవ్వని రెండు సౌందర్యాలను నీకు ప్రసాదించాడు దేవుడు!'

దేవతలాంటి నీకే, వసంతా, ఇంత అన్యాయం జరిగిపోతూంది! పరువాన్ని కాళ్ళకు బరువైన సంకెళ్ళనా

*మనిషిగా జన్మ ఎత్తడం గొప్ప కాదు. మనిషిగా బ్రతకాలి. మనిషిగా రాణించాలి. మనిషిని తీర్చిదిద్దేది ధర్మం. ధర్మచ్యుతి జరిగిననాడు మనిషికి పతనం తప్పదు. పట్టెడు కబళం దొరకని వాడు కడుపు నింపుకొనడానికై ఏ అత్యాచారమైనా చేస్తాడు. పరువపు ఆకలి తీరనినాడు, అది వెర్రితలలు వేసి, మనిషి నైతిక బలాన్ని, నిగ్రహశక్తిని పరీక్షిస్తుంది. దానికి వశంకాని వ్యక్తి అజేయుడే!*

తగిలించుకుని, భావిజీవితపు ఎడారిలో ఈడ్చుకుంటూ ఒక ఇసుక రేణువుగా హరించుకు పోదలిచావా, వసంతా?'

పార్థసారథి హృదయం తరుక్కుపోయింది.

బరువుగా అడుగులు వేసుకుంటూ వెళ్ళి, వంగుని భక్తి వినయాలతో భర్త పాదాలను తన రెండు చేతులతోనూ స్పర్శించి, కళ్ళకు అద్దుకుంది వసంత.

ఆమె చెక్కిళ్ళమీంచి జాలువారిన కన్నీటి బిందువులు అతడి పాదాలను అభిషేకం చేశాయి.

"వ . . . సం . . ." ఆపైన వినిపించలేదు అతడి గొంతు. వంగుని వసంత భుజాలమీద చెయ్యి వేసి, అనునయంగా లేవనెత్తి, చుబుకాన్ని ఎత్తి ఆమె మొహంలోకి చూశాడు.

పచ్చని ఆకులతో, పలురంగుల పూజాతులతో శోభాయమానంగా, కనుల పండువుగా కనిపించే మొక్కలను, చెట్లను వరసపెట్టి నరికివెయ్యగా మిగిలిన ఉద్యానవనంలా ఉంది ఆమె వదనం!

చమురు నిండుకున్న కుందుల్లో కొడిగట్టి కాలుతూన్న ఎత్తులు ఆమె కళ్ళు!

అతడి కనుపాపలు తడిశాయి.

"వ . . . సం. . . తా! నీ నిర్ణయాని కిహ తిరుగు లేదా? . . . ఇలా జరిగి తీరవలిసిందేనా?"

అతడి పెదవులు ఆరిపోయాయి.

"నన్ను మన్నించండి! . . . ఈ నిర్ణయం నాది కాదు. ధర్మానిది.

'ధారణా ద్ధర్మ మిత్యాహుః
ధర్మో ధారయతే ప్రజాః
య త్స్యా ద్ధారణ సంయుక్తః
స ధర్మ ఇతి నిశ్చయః'

సంఘజీవి అయిన మనిషిని శాసించేదీ, మానవ జీవితాలను తీర్చిదిద్దేదీ ధర్మం.

ఆ ధర్మమే నన్ను మీకు దూరంగా తీసుకుపోతూంది."

"వ. . . సం. . . తా!" పిచ్చికేక పెట్టి, ఒక్కసారిగా వసంతను గాఢంగా తన అక్కున చేర్చుకున్నాడు.

"వద్దు, వసంతా!. . . వద్దు! . . . ఇంక చెప్పకు, వినలేను." బాధతో వెక్కిళ్ళు తిరిగిపోతూ ఆమె తలను లాలనగా నిమిరాడు.

"ధర్మానికీ, న్యాయానికీ బద్ధులై మన పురాణేతిహాసాలలో ఎందరో రాజాధిరాజులూ, చక్రవర్తులూ తమ తమ సింహాసనాలను త్యజించి. ఆప్తులకూ, ఆత్మీయులకూ దూరమై అరణ్యాల పాలయ్యారు. అష్టకష్టాలూ అనుభవించారు . . .

"శ్రీరామచంద్రుడు అరణ్యవాసానికి పోయిం దెందుకు? కుసుమ కోమలీ, నిండు గర్భవతీ అయిన ఇల్లాలిని అడవుల్లో విడిచిపెట్టిం చిందెందుకు? హరిశ్చంద్రుడు ఆలుబిడ్డలను సహితం అమ్ముకుని, తాను కాటికాపరై అష్టకష్టాలు పడిం దెందుకు? కపోతాన్ని రక్షించి డేగకు తన కండలనే కోసి ఇచ్చాడు శిబి చక్రవర్తి. ఎందుకు? — ఇలా ఎందరో మహానుభావులు, పురుషోత్తములు పెట్టిన ఒరవడి మనది. ఆ మహోన్నత సంప్రదాయాలను తరతరాలనుంచీ జీర్ణం చేసుకున్న రక్తం మనలో ప్రసరిస్తూంది.

నన్ను మరిచిపోవటానికి ప్రయత్నించండి!"

"అపరాధం ఒకరిదీ, శిక్ష ఇంకొకరికీనా, వసంతా? . . . ఇది ఏ సంప్రదాయం చెప్పింది?"

"మీరు ఏ అపరాధమూ చెయ్యలేదు. మీకు అతీతమైన శక్తుల హస్తాలలో మీరు అశక్తులయ్యారు. అంతే!

శకుని, దుర్యోధనులతో పాచికలాడి ధర్మరాజు రాజ్యాన్ని పోగొట్టుకుంటే, 'నిన్ను జూదం ఎవరాడ మన్నారు? దీనికి శిక్ష నువ్వే అనుభవించు!' అని అతని తమ్ములూ, భార్య ద్రౌపది అన్నారా?

వివేకత లేక కాదు, తనకు అతీతమైన శక్తుల చేతుల్లో అశక్తుడయ్యాడు ఆనాడు ధర్మరాజు. దాని వల్ల సంప్రాప్తమైన కష్టాన్నీ,సుఖాన్నీ ఒక్క తమ్ములూ, భార్యేకాదు — పాండవ వంశం అంతా పంచుకుంది.

ఇప్పుడు ఫలితం మంచయినా, చెడయినా, అర్ధాంగిగా నేను మీలో సగభాగం కనక, ఆ ఫలితంలో నాకూ సగం వంతు వస్తుంది. అదే ఇప్పుడు పంచుకుంటున్నాను."

ఆమె అవ్యాజానురాగానికి అతడు కరిగిపోయాడు.

ఆమెలోని దేవతకు అతడి అంతరంగం ఒక్కసారి మొక్కింది.

"నీకు ఇంత అన్యాయం చేసినవాడిమీద ద్వేషం లేదా, వసంతా?"

"పూలు ఉన్న తావు అంతా తావితోనే నిండి ఉంటుంది. రాగం నిండినచోట ద్వేషానికి తావు లేదు."

ఉక్కిరి బిక్కిరై పార్థసారథి మూగపోయాడు.

ఇద్దరిమధ్యా క్షణంపాటు నిశ్శబ్దం అవహించింది.

"ఈ వరువంలో ఒంటరి జీవితం పదునైన కత్తిమీద సాము చెయ్యటంలాంటిది, వసంతా! అది అతి దుస్సాహసం. ఆత్మహత్యాసదృశం."

"ధర్మం కవచమై కాస్తూన్నప్పుడు, ఎంత పదునైన కత్తి అయితేమాత్రం ఏం చేస్తుంది? . . . ఆ ఆత్మధృతే నాకు అండదండలు . . .

మీకు దూరమైపోతూ, మిమ్మల్ని మనసారా వేడుకుంటున్నాను . . ." క్షణం ఆగి, "త ... వ్వ ...

## అవసరాల నారాయణరావు

సులభ వాయిదాలమీద

నెలకు రు. 15/- చెల్లుబడిమీద సాండర్ జపాన్‌మాడెల్ పోర్టబుల్ ట్రాన్సిస్టర్ అఖిల ప్రపంచం, 3 బాండ్లు, 8 ట్రాన్సిసర్లు, డబుల్ స్పీకర్. అన్నిఖర్చులు కలుపుకు అదనమైన 69 సం॥పు పర్సుడ్రైరీతో వెల రు.300/-లు. ప్రతి పత్రికకు, పటకానికి పంపవచ్చును. వ్రాయండి.

TOKYO AGENCIES (WAP)
Post Bag 11, New Delhi-1.



ఏజంట్లు కావలెను

100% టెరిలిన్ షర్టుముక్కలు, పాంట్ ముక్కలు, పీసుకు కమీషను లేక రు. 225/- నుంచి రు. 475/-వరకు జీతంమీద ఏజంట్లు కావలెను. షరతులకు, పూర్తి సైజు నిడివి ఉచిత శాంపిలుకు వ్రాయండి.

SHAKTI AGENCIES (WAP)
Qutab Road, Delhi-6.

ఏజంట్లు కావలెను

ఉత్తమరకపు సౌందర్యపోషక ద్రవ్యములు, సెంటుసెంట్లు, గడియారపు పట్టాల (నిత్య వాడకపు అయిటములు 100) అమ్మకము పై కమీషను మీద, లేక నెలకు రు. 275— నుండి రు. 450—ల వరకు జీతము మీద కొంత కాలము/పూర్తి కాలము పనిచేయు ఏజంట్లు కావలెను. ఉచిత శాంపిలుకు, షరతులకు వ్రాయండి.

VENUS CORPORATION (APW)
Sadar Bazar, Delhi-6.

స్టీం వాష్ మీ గుడ్డలకు
మెరుగు నిస్తుంది
మీ గుడ్డలను మాకు పంపండి

ఫీనిక్స్ (రిజిస్టర్డ్)
ఎలక్ట్రిక్ డ్రై క్లీనర్స్

హైదరాబాద్ — సికింద్రాబాద్
అంతటా మా బ్రాంచీలు కలవు

A.A.

రు . . . క . . . దూ?" అంది భారంగా, ప్రాధేయపడుతూన్న చూపుతో పార్థసారథి కళ్లల్లోకి చూస్తూ.

"నన్ను మనిషిని చేశావు. నాకూ ఓ హృదయం ఉందని చూపావు. నన్ను మేల్కొలిపావు. ఇంకా అన్యాయం చేస్తానా, వసంతా? త్రికరణశుద్ధిగా చెబుతున్నాను. నా మాట నమ్ము!"

ఆమె చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు.

అవతల గుమ్మంలో టాక్సీ హారన్ ఒక్కసారి భయ్యిమని మోగింది.

ఇద్దరూ ఉలిక్కిపడి ఎడమయ్యారు.

టాక్సీవైపు అడుగు తీసి అడుగు వెయ్యటానికి వెయ్యి ఏనుగుల బలం కావలిసివచ్చింది వసంతకు.

కన్నీటి అలలతో కదిలి, పగిలిన గుండెల నెరజల్లో నుంచి టాక్సీ నాంపల్లివైపు దూసుకుపోయింది!

* * *

విజయనగరం,
4—2—66

"పూజ్యులైన మీకు నా సవినయ నమస్కృతులు. మీ ఉత్తరం చేరింది. శుభవార్తకు సంతోషం. ఉత్కృష్టమైన మానవజన్మ ఎత్తినందుకు, నా జన్మకు ఓ ప్రయోజనం సిద్ధించింది. నా జీవితాన్ని సార్థకం చేసుకోగలిగాను. ఇంతకంటె వేరే ఏం కావాలి నాకు?

మీరు పంపించిన ఫోటోలుకూడా అందాయి. పెట్టెలో బట్టల అడుగున పదిలంగా దాచుకున్నాను.

'నువ్వు ఎలా గడుపుతున్నావో ఏమో? . . . నిన్ను అంధకారంలోకి తోసేశాను' అంటూ వ్రాశారు.

నాకేం? . . . నిక్షేపంలా ఉన్నాను. అమ్మా నాన్నా ఇక్కడ నన్ను కాలు కింద పెట్టనీయటంలేదు.

నాకేం దిగులు? నా గురించి మీరు బాధపడితే, పరోక్షంగా నన్ను బాధించినట్లే. నేను బాధపడటం మీ కిష్టమా?

మొన్న . . .

ఇంత లేత గులాబీ రంగు నూలు దారపుండ ఒళ్లో వేసుకుని, నా రూమ్‌లో నైట్‌క్వీన్ ఉన్న కిటికీదగ్గర కూర్చుని బేబీ సాక్సు అల్లుతున్నాను.

మా అమ్మ ఎప్పుడు చూసిందో చూసింది. వేవిళ్ల కోసమో పనయ్యానని తెలిసిన క్రూరాడి మొహంతో పరుగెత్తుకుంటూ వెళ్లి మా నాన్నగారిని తీసుకువచ్చింది. నే నల్లుతూన్న మేజోళ్లవైపు కనుసంజ్ఞ చేసి చూపించి, ఆయన చెవిలో ఏదో గుసగుసలాడింది. ఆయన మొహం ఒక్కసారిగా చామంత అయింది.

వాళ్లను చూసి నాకు జాలి వేసింది.

అమాయకులు! . . . వాళ్లు అంధకారంలో ఉన్నారు.

ఆవేళ బజారుకు వెళుతూ మా నాన్నగారు నా దగ్గిరికి వచ్చి, 'నీకు ఏం తినాలని ఉందమ్మా? . . . కోవా తేనా? ... గులాబ్‌జాం తేనా? ... ఏం తేనూ?' అంటూ ఇలా వాటిని పేరుపేరునా వరసపెట్టి చెప్పి అడిగారు.

కన్నవాళ్ల కంటికీ, ఇంటికీ కొత్త వెలుగు నిచ్చే బోసినవ్వుల దీపాల తల్లిగాకాక, ఎప్పటికీ చిగురించని ఎండిన మోడునై వాళ్ల గడపలో పాదం మోపానని పాపం, వాళ్లకేం తెలుసు?

జాలి, నవ్వూ, బాధా — మూడూ ఒక్కసారిగా నాలో ముంచుకువచ్చాయి.

కాని, ఏం చెయ్యను? . . . ఎలా చెప్పను? . . . చెప్పి వాళ్లను ఎలా చూడగలను? . . . వాళ్లు ఆ అంపపుకోతను ఓపలేక విలవిల్లాడిపోతూంటే, నేను చూసి ఎలా భరించగలను?

నిజం నిప్పులాంటిది!

ఆ నిప్పును నన్నే కాల్చనివ్వండి! నాలోనే అది నివురుగా మారాలి!

"ఏమమ్మా, వసంతా! . . . ఏం తెమ్మన్నావు?" అని మా నాన్నగారు రెట్టించేసరికి చటుక్కున అప్రయత్నంగా "పూతరేకులు, నాన్నా!" అనేశాను.

ఆయన నవ్వుకుంటూ వెళ్లిపోయారు.

ఆయన అలా వెళ్లిపోగానే నేను నవ్వుకున్నాను.

"పాపం! ... నీకు పూతరేకులు మనసయ్యాయా, పిల్లా?" అని ఎవరో వెటకారం ఆడారు, ఎక్కడో ఉండి.

మానవ జీవితానికీ, పూతరేకులకీ ఎంత దగ్గిర పోలికలున్నాయనీ!

జీవితంలాగే అవీ నిప్పులమీద కాలతాయి!

జీవితంలాగే అవీ ఇట్టే ముక్కలైపోతాయి.

జీవితంలాగే అవీ చప్పగా ఉంటాయి!

ఆ పూతరేకులకోసం ఆరోజు ఆయన ఊరంతా కాళ్లరిగిపోయేలా తిరిగారు. ఎక్కడా దొరికాయికాదు. ఎంతో నొచ్చుకున్నారాయన.

దిక్కుమాలిన నోరు కాకపోతే, . . . పోయి పోయి, దొరకని వస్తువునే కోరాలా?

అదేమిటోగాని . . . ప్రయత్నంచేతనైనా, అప్రయత్నంగానైతా జీవితం ఎప్పుడూ అందని వస్తువునే అడుగుతుంది!

మరునాడు మనిషిని విశాఖపట్నం పంపించి తెప్పించి, ఇంత నెయ్యీ, చక్కెరా పోసి చుట్టించి, నాకు ఇచ్చేదాకా నిద్రపోయారుకాదు!

కన్నకడుపులు కదూ, ఆ మమత అలా ఏడిపిస్తుందేమో!

ఓరోజున . . . పైత్యంచేసి . . . కడుపులో తిప్పి, ఇంత వాంతిలా అయితే "పక్కింటి రంగాచార్యులగార్ని అడిగి ఓ ఆయుర్వేద మాత్ర పట్టుకురావే, అమ్మా!" అన్నాను మా అమ్మతో.

దానికి మా అమ్మ చిన్నగా నవ్వి "నీ మొహంలా ఉంది. ఈ వాంతులకు మందులు వాడరే, పిచ్చితల్లీ! . . . అవే పోతాయి. వెళ్లి మంచంమీద పడుకో!" అని అనునయంగా నన్ను రెక్క పట్టుకుని నా గదిలోకి తీసుకువెళ్లి పరుపుమీద పడుకోబెట్టి, ఇంత హార్లిక్సు కలిపి పట్టుకువచ్చింది. ఇహ ఆ వేళనుంచి . . . పాలు, పళ్ళ రసాలు, కాఫ్సూల్సు, టానిక్కులు! ఒక రకంకాదు! గంటకొకటి. ఇలా ఒకటి నోట్లో పోసి వెళ్లి, అలా ఇంకోటి పట్టుకువచ్చి పోస్తూంది!

కొన్నాళ్లు పోతే . . . నన్ను చూసినవాళ్లంతా . . . నేను కాదన్నా . . . నమ్మలేనంతగా తయారవుతాను!

కడుపుతీపి అంటే అలా ఉంటుంది కాబోసు!

ఏ ఆడదానికైనా ఆ అదృష్టం పట్టి, ఆ అనుభూతిని స్వయంగా అనుభవించగలిగి నప్పుడుగాని ఆ

అనుభూతిలోని తీపి, ఆ మమతలోని లోతు అర్థం కావు!

మా అమ్మావాళ్ల హడావిడి అంతటితో అయిపోలేదు.

మా నాన్నగారు పంచాంగం తిరగేశారు.

మా అమ్మ తెల్లవారుఝామునే లేచి, నాకు తలంటు పోసి, కొత్త చీర కట్టబెట్టింది.

"చేతికి ఉన్నాయ్ కదమ్మా! . . . ఇంకా ఎందుకు?" అన్నాను, గుమ్మంలో గాజుల మలారం దింపుకున్న గంగిమ్మతో మా అమ్మ ఏదో చెబుతూంటే.

"ఈ కాలం పిల్లలకు ఏమీ తెలియవు!" అని స్వగతంగా అనుకుని, "అలా వేయించుకోవే, తల్లీ!... ఎన్నో వద్దు, ఆనవాయితీకి ఈ చేతికి రెండు, ఆ చేతికి రెండు వేయించుకో. అంతే!" అంది మా అమ్మ.

ఏం చెయ్యటం? . . . నా కడుపులో ఎవరూ లేరనీ, నేను తేలిగ్గా తిరుగుతున్నాననీ చెబితే వింటారా? నమ్ముతారా?

వాళ్లను "అమ్మమ్మా!", "తాతయ్యా!" అని పిలిచే నోళ్లను నే నివ్వలేనని వాళ్లకేం తెలుసు? వాళ్ల అంతటి అదృష్టానికి నోచుకోలేదని ఏ శక్తి చెప్పగలదు?

మధ్యాహ్నం మూడు గంటలకు మళ్లీ కొత్త చీరను కట్టబెట్టి, నా కాళ్లకు పసుపూ అదీ పూసి, ముందు హాలులో కుర్చీమీద కూర్చోబెట్టింది.

"ఇప్పు డిదంతా ఎందుకమ్మా నీకు చాదస్తం కాక పోతే" అన్నాను, ఏదో వారించాలనే తాపత్రయంతో.

"మా కన్నీ చాదస్తంగానే కనిపిస్తాయి! మేము పాతతరంవాళ్లం. మా కేమంత పదిమంది ఉన్నారనీ!" ఒక్కగా నొక్కర్తెవు. మా ముద్దూ ముచ్చట్లూ ఎప్పుడు తీరనూ?" అంది.

అవును, మరి! వాళ్ల ముద్దూ ముచ్చట్లూ ఎప్పుడు తీరనూ? . . . ఎలా తీరనూ? . . . ఇంకెవరివల్ల తీరనూ?

గాలి, నీరూ మనిషి మనుగడకు ఎంత ప్రధానమో, భ్రాంతి అనేదికూడా అంతే ప్రధానం!

భ్రాంతి అనే బేస్‌మెంట్‌మీద మానవుడు ఎన్ని ఆశాసౌధాలు నిర్మించుకుంటాడు! ఎలాంటి మధురానుభూతుల్ని పేర్చుకుంటూపోతాడు! భ్రాంతి, వెనకన ఉండి, మనిషిని ముందుకి నెట్టుతుంది! అడుగున ఉండి, ఎత్తుకు లేపుతుంది! ఈ భ్రాంతి అనేదే లేకపోతే, మనిషికూడా ఓ మానులా, ఏ మూలనో ఉన్నచోటనే చలనం లేకుండా పడిఉండేవాడు! జీవితం ఒక రోతగా తయారయ్యేది!

పసుపూ, పళ్లూ, జాకట్టు గుడ్డలూ . . . ఇంకా ఏమేమిటో, ఎవరికి తోచినవి వాళ్లు పళ్లాలలో పెట్టుకుని, మా ఇంటికి పేరంటాళ్లు వచ్చేశారు. ఏవేవో పాటలు పాడారు. హారతు లిచ్చారు. వాళ్లందరికీ నేతి మిఠాయిల్ని వాయనంగా ఇచ్చింది మా అమ్మ.

వాళ్లందర్నీ చూసిన నాకు జాలి వేసింది. బాధ అనిపించింది.

ఈ ప్రపంచంలో తమకు తాము మోసపోయి ఊరుకునేవాళ్లు కొందరు.

తాము మోసపోయి, ఎదటివాళ్లనుకూడా మోసం చేసేవాళ్లు కొందరు!

ఈ రెండో వర్గానికి చెందింది మా అమ్మ! తాను మోసపోవటమేకాక, మా ఊళ్లో ఉన్న అమాయికులైన ఆడవాళ్లనందర్నీ మోసం చేసిపారేసింది!

వచ్చినవాళ్లందరికీ ఇంత భ్రాంతిని వాయనంలో కలిపి ఇచ్చి మరీ పొమ్మంది.

మొహానికి రంగులూ అవీ పూసుకుని, సందర్భానికి తగ్గ ప్రత్యేకమైన దుస్తులూ అవీ ధరించి, ప్రేక్షకుల వినోద వికాసాలకోసం ఏ కొద్దిమందో రంగస్థలంమీద, సినిమా తెరమీద అభినయించే ప్రక్రియనే 'నటన' అనుకునేదాన్ని ఇన్నాళ్లూ. నటులంటే వాళ్లే అనుకునే దాన్ని.

కాని ఇప్పు డర్థమైంది, జీవితం అనేది ఒక పెద్ద రంగస్థలం అనీ, దానిమీద ప్రతి వ్యక్తీ నటుడేననీ!

ముదుసలి ముత్తైదువుల దీవనలకూ, తోటి వయసు మిత్రురాండ్ర వెటకారాలకూ ముసిముసి నవ్వులు కురిపించి, 'నే నింత ఘనకార్యం చేశాను సుమా!' అనే గర్వభావం నా మొహంలో తొణికిసలాడేలా, ఏ సుప్రసిద్ధ సినిమాతారాకూడా అభినయించలేనంత గొప్పగా అభినయించాను!

నా సీమంతోత్సవం ఏ గాబోయే తల్లికీ జరగనంత ఘనంగా జరిగింది కదూ?

వ్రాస్తూన్నప్పుడు పంక్తుల్లో ప్రతి మూడేసి అక్షరాలకూ ఒక్కొక్క అక్షరం అలుక్కుపోయింది! ఎలా చదువుకుంటావో ఏమో?

జవాబు వ్రాస్తావు కదూ?

నమస్కృతులతో, ఇట్లు,

—వసంత."

ఒక్కసారి రెండుకళ్లూ మూసుకుని, ముడిపెట్టిన కనుబొమలతో రెప్పలు నొక్కుకున్నాడు పార్థసారథి.

అతని వేళ్ల మధ్య పుటలపై వెచ్చని సజల ధార కురిసింది.

• • •

"హాయిగా నీ పనే బావుందే, వసంతా! . . . నీ బాదరబందీ లేని స్వేచ్ఛా జీవివి! . . . కాపురాలు చేసుకుంటూన్న మేం అంతా కట్టుకున్నవాడికీ, కన్న పిల్లలకీ చాకిరీ చేసిపెట్టలేక చస్తున్నాం!"


మంచంమీద కూర్చుని, కిటికీ ఊచల్లోంచి ఆకాశం లోకి శూన్య దృక్కులతో చూస్తూ ఏవేవో ఆలోచనల్లో మునిగిపోయిఉన్న వసంత ఒక్కసారిగా అదిరిపడింది.

గుమ్మంవైపు తల తిప్పి చూసింది.

వల్లి! . . . తన సహపాఠి, ప్రాణమిత్రురాలూ అయిన కల్పవల్లి! గంభీరంగా మొహంపెట్టుకుని, గుమ్మంలో నించునిఉంది.

ఆ గంభీరవైఖరిలో, ఆ మాటల విసురులో ఉన్న గుప్తార్థం గురిచూసి బలంగా విసిరిన బాకులా వసంత గుండెలో గుచ్చుకుపోయింది.

అటువంటి బాకుపోట్లు ఇటీవల తనకు రోజూ ఏదో వేళప్పుడు, ఏ దిక్కునుంచో ఓ దిక్కునుంచి తగులుతూనే ఉన్నాయి.




కాని, వల్లి . . . కాలేజీలో చదువుకునే రోజుల్లో తనతో ఎంతో సన్నిహితంగా ఉంటూ, తననూ, తన మనస్తత్వాన్నీ క్షుణ్ణంగా ఎరిగిన కల్పవల్లి . . . కూడా అదే ధోరణిలో మాట్లాడటం వసంతకు ఆశ్చర్యం, బాధ కలిగించాయి.

కాని పైకిమాత్రం చిరునవ్వు చిప్పిలగా, ఎదురు వెళ్లి సాదరంగా "రావే, వల్లీ! . . . అంతా కులాసా? . . . బరంపురంనుంచి ఎప్పుడు వచ్చావ్? . . . మా పిల్లల్ని తీసుకువచ్చావ్ కాదేం?" అంటూ ఆమెతో చెయ్యి కలిపింది.

"పిల్లలంటే నీకింకా ఎక్కువ అసహ్యం ఏమోనని తీసుకురాలేదే!"

ఓరచూపులతో ఓసారి వసంతవైపు వాడిగా చూసి, మళ్లీ అంతలోనే ఎలుక్కుని మొహం ఇటు తిప్పేసుకుంది వల్లి.

ఒక్కొక్కప్పుడు ఆప్తులనిపించుకున్నవాళ్లు, ఆత్మీయులైనవాళ్లు అన్న మాటలు గాయపరిచినంత

తీవ్రంగా బద్ధశత్రువులన్న మాటలుకూడా గాయ పరచలేవు!

పరంపరలుగా ఒకదానిమీద ఒకటి, వల్లి విసురు తున్న వాక్బాణాలు ఒకదాన్ని మించి ఒకటి లోతుగా తన గుండెలో నాటుకుపోతున్నాయి.

ఇద్దరూ ఒకరి సరసన ఒకరు మంచంమీద కూర్చున్నారు.

"నువ్వుకూడా నన్ను ఇంతే అర్థంచేసుకున్నావా, వల్లీ? . . . నాఅంత దురదృష్టవంతురాలు ఈ భూమిమీద మరొకర్తి ఉండబోదేమో!"

అప్రయత్నంగా వసంత కళ్ళు చెమ్మగిల్లాయి.

గుండెల్ని పిండే విషాదాన్నయినా, గుండెల్లో పొంగే ఆనందాన్నయినా . . . నాలుకకూడా చెప్పలేనంత బాగా సగం బుగ్గమీదికి జారి, ముత్యంలా మెరుస్తూన్న ఒక్క కన్నీటి బిందువు చెబుతుంది!

వసంత ఒడిలో రెండు ముత్యాలు రాలాయి!

వల్లి మనసు చివుక్కుమంది. హృదయం ఆర్ద్రమైంది.

'ఛ! . . . నేను వచ్చిన పనేమిటి, చేస్తూన్న పనేమిటి? . . . కష్టంలో ఉన్న స్నేహితురాల్ని పరామర్శించటానికి వచ్చి, కష్టం, సుఖం అడిగి, మంచీ, చెడూ చెప్పి, ఓదార్చవలసిందిపోయి, శూలాల్లాంటి సూటి పోటి మాటలతో పొడుస్తున్నాను, ఎంత మూర్ఖురాలిని!'

"నీ మనసుకి కష్టం కలిగించాను. క్షమించవే వసంతా." రెండు చేతుల్నీ పట్టుకుంది వల్లి.

"లేదే. . . నువ్వు నన్నేం బాధించలేదు." వేళ్లతో రెండు బుగ్గల్నీ తుడుచుకుంది వసంత."

ఇద్దరిమధ్యా . . . కాలం కనురెప్పపాటు చప్పుడు చెయ్యకుండగా కదిలింది.

"నువ్వే ఇంత తొందరపడతా వనుకోలేదే! . . . చదువుకునే రోజుల్లో నీలో ఉండే ఆ ఓర్పూ, నేర్పూ అవన్నీ ఏమైపోయాయి?"

స్వభావసిద్ధంగా దురుసుతనపు పాలు కొంచెం ఎక్కువగా ఉన్న వల్లి, ఎంత ప్రయత్నించినా, అంత కంటె తక్కువ తీవ్రతతో తన భావాన్ని వెలిబుచ్చలేక పోయింది.

"ఆమధ్య ఎప్పుడో ఓసారి రత్నంవాళ్ళ ఇంటికి వెళ్ళాను. ఇద్దరు పిల్లలు దానికి. నిక్షేపంలా ఉంది దాని సంసారం ఇప్పుడు.

'ఏమే, రత్నం! . . . ఇప్పుడు మీ ఆయనతో కుస్తీ పట్టడం, బాక్సింగ్ చెయ్యటం మానేశావేమిటే? అని ఏదో వెటకారంగా నేనంటే, ఒ చిన్న నవ్వునవ్వి అది ఏమందో తెలుసా? . . .

'ఊరుకోవే! . . . ఏవో రెండు ముక్కలు చదువుకున్నాం కదా అని కళ్ళు నెత్తిమీదికి పోయి, ఆ బిరుసుతనంతో వ్యక్తిత్వంఅనీ, వ్యక్తి స్వాతంత్ర్యం అనీ—ఇలా ఏవేవో వెర్రిమొర్రి వాగుళ్ళతో నాకంగా రూపొందించుకోవలసిన దాంపత్యజీవితాన్ని నరక ప్రాయంగా తయారు చేసుకోవటం! . . .

'నా సంసారం బాగుపడి, ఇద్దరు పిల్లలతో ఈ ఇల్లు ఈవేళ ఇలా కలకల్లాడుతూందంటే, అదంతా వసంత పెట్టిన భిక్షేనే! చీకట్లో తడుముల్లాడుతూన్న నాకు, దీపం చూపెట్టిందదే! . . .

'ఎంత సునిశితమైన మేధ దానిది! . . . ఏమి దూరదృష్టి! . . . ఎంత సహృదయం! . . . దేవత లాంటి మనిషి! . . . చేతులెత్తి మొక్కాలనే దానికి! . . . దాని ఋణం ఎలా తీర్చుకుంటానో!' . . .

"నీలోని ఆ అర్హతలన్నీ ఏమైపోయాయి! వ్యక్తులనూ, వాళ్ళ వాళ్ళ వ్యక్తిత్వపు స్వభావాలనూ మనస్తత్వవేత్తలకంటే క్షుణ్ణంగా ఆకళింపుచేసుకుని, సందర్భోచితంగా, సముచితమైన సలహాలూ అవీ ఇచ్చి, ఎదటి వాళ్ళ సంసారాలను చక్కదిద్ద గలిగే సామర్థ్యం గల దానివి, నీ సంసారాన్ని నువ్వు ఎందుకు చక్కదిద్దుకోలేక పోయావు? . . .

చెప్పు, వసంతా! . . . చెప్పు!"

ఏదో ఆవేశంలాంటిది ముంచుకురాగా, వసంత భుజాలను పట్టుకుని కుదుపుతూ అడిగింది వల్లి.

"ఏదో అభిమానంకొద్దీ మీరంతా అలా అనుకుంటున్నారుగాని, నాలో ఆ అర్హతలూ లేవే; నేను దేవతనూ కాను" నిట్టూర్చింది వసంత.

"ఆవేశంలో ఏదో తొందరపడ్డావు. పోనీ, ఇప్పుడైనా మించిపోయింది లేదు. తప్పు అయిపోయిందని చెంపలు వాయించుకుని, పాదాలమీద పడు.

కాళ్ళమీద పడితే కఠిన శిల అయినా కరగక మానదు."

> **పురుషులు**
>
> పురుషులు కూడా బాలురే. తల నెరిసినప్పటికీ వాళ్లు ఆకృతిలోనే పెద్దవాళ్లు.
>
> —సెనెకా

వల్లి అమాయికత్వానికి మనసులో జాలిపడి, పైకి పేలవంగా చిన్న నవ్వు నవ్వేసి ఊరుకుంది వసంత.

"నువ్వు గడపాలనుకుంటూన్న జీవితం నువ్వనుకుంటూన్నంత సులభం కాదే బాబూ! . . .

పరువం చాలా చెడ్డది.

కతకటానికి కబళం దొరకని వాడు కడకు జేబులు కొట్టడానికీ, కన్నం వెయ్యటానికీ దిగుతాడు.

పరువపు ఆకలి తీరని నాడూ అంతే! అది వెర్రి తలలు వేసి, నీ నైతిక బలాన్నీ, నిగ్రహశక్తినీ పీల్చి పిప్పిచేసి, వెంటబడి తరుముతుంది. ఏదో ఒకదశలో నువ్వు దానికి వశంకాక తప్పదు. ఇంద్రియాలను జయించి, ఘోరమైన తపస్సు చేసుకుంటూన్న మహా మహా మునిపుంగవులకే దిక్కు లేకపోయింది. వాళ్ళే దానికి వశం అయిపోయారు. ఇక నువ్వూ, నేనూ అనగా ఏపాటి?

అప్పు డింక వేరే దారి కనబడదు. గోతులున్న దారే గతి అవుతుంది. పడిపోతావు! ప్రపంచం అంతా నీ వంక వేలుపెట్టి చూపుతుంది. నీ దుర్గంధాన్ని భరించలేక ముక్కు మూసుకుంటుంది లోకం. క్రిమికీటకాలకు స్థావరమై కుళ్ళు కంపు కొడుతూన్న మురికిగుంటగా తయారవుతుంది బ్రతుకు. ఆ నికృష్ట బ్రతుకు కావాలా నీకూ? లేక ఆదరంతో అక్కున చేర్చుకుని, అనునయంగా తలను నిమిరే చల్లని చేతుల్లో హాయి అయిన, ఆదర్శప్రాయమైన జీవితం కావాలా? ఆలోచించుకో వసంతా!

'బాల్యే పితుర్వశే ఓ
పాణిగ్రాహస్య యౌవనే
పుత్రాణాం భర్తరి ప్రేతే
న భజేత్ స్త్రీ స్వతంత్రతాం.'

జన్మతః ఆడది అబల. ఎప్పుడూ ఒక్కర్తీ ఒంటరిగా బ్రతకలేని జన్మ దానిది. పుట్టిననాటినుంచి గిట్టేవరకూ ఎప్పుడూ ఎవరో ఒకరు తనకు రక్షణ కావాలి.

బాల్యంలో తండ్రి అధీనంలో, యౌవనంలో భర్త వశంలో, వృద్ధాప్యంలో పుత్రుల జాగ్రత్తలో ఉండాల్సిందేకాని, స్త్రీ విడిగా స్వతంత్రంగా ఉండలేదు.

ఈ రక్షణలు లేని స్త్రీ దుష్టులైన పురుషుల బారినుంచి తనను తాను కాపాడుకోలేదు. అందులోనూ నీలాంటి ఆడది అంటే అందరి కళ్ళూ నీమీదే ఉంటాయి. నిన్ను చులకనగా చూస్తారు. నిన్ను చూసి వెకిలివేషాలు వేస్తారు. పోకిరీ చేష్టలు చేస్తారు. ఎన్ని విధాల నిన్ను అవమానించాలో అన్ని విధాలా అవమానిస్తారు. ఆకలిగొన్న అడవి మృగం తన వేట కనిపించగానే, తోక ఆడిస్తూ ఒడుపుతో, వెనకకాళ్ళమీద వంగి నించుని అదును దొరకగానే అమాంతంగా మీదికి ఉరికినట్లు, సమయంకోసం కాచుకూర్చున్న దుష్టులైన పురుషులు అదును దొరకగానే నీమీద పడి, నిన్ను వశం చేసుకుని, నీ మానాభిమానాలను తమ పశుబలానికీ, పైశాచిక ప్రవృత్తికీ బలిచేస్తారు. ఆపైన ఇక, లోకానికి మొహం చూపలేవు. చివరకు మృత్యువే శరణ్యం అవుతుంది. చావటానికి అనేక మార్గాలున్నాయి. ఏ ఉరో పోసుకుంటావు. నువ్వంటే ఎలాగో చచ్చిపోతావు. కాని, నువ్వు తెచ్చిపెట్టుకున్న అప్రతిష మాత్రం ఎప్పుడూ బ్రతికేఉంటుంది. నువ్వు ఆపాదించిన కళంకం నీ వంశాన్ని పట్టుకుని తరతరాలదాకా వేళ్ళాడుతూ ఉంటుంది. కీర్తి అయినా, అపకీర్తి అయినా వంశానికి ఆడదానివల్లే వస్తుంది, వసంతా . . .

ఆలోచించుకో . . .

నీకు నేను చెప్పతగినదానముకాను. అయినా, చెప్పక తప్పిందికాదు కాబట్టి చెబుతున్నాను. . .

"నీగురించి బెంగపెట్టుకుని, నిద్రాహారాలు మాని, కళ్ళల్లో ప్రాణాలు పెట్టుకుని, కాలాన్ని బరువుగా ఈడుస్తూన్న నీ కన్నవాళ్ళను చూస్తూంటే నీ కడుపు తరుక్కుపోవటంలేదా, వసంతా? కనీసం వాళ్ళకోసమైనా నీ పంతాలను, పట్టుదలలను సడలించి, చీకట్లోంచి వెల్తురులోకి రా!

ఆవేశం వచ్చింది. కాలేజీ చదువు వెలిగించాం కదా, డిబేటింగ్ అలవాటాయె మరి. ఉపన్యాస ధోరణిలో ఏవేవో వాగాను. అందులో ఏదైనా మంచి ఉంటే తీసుకో. నేను వాగినదాంట్లో నీకు పనికివచ్చేది వందోవంతయినా ఉంటే, అది నీ కేదైనా మేలు చేస్తే అంతే చాలు. అది నాకు గర్వకారణం అవుతుంది.

మరి వస్తా! . . . "

ఆ వాగుడు వసంతమీద ఎలాంటి ప్రభావాన్ని కలిగించిందో కని పెట్టే ఉద్దేశ్యంతో వసంత మొహం

లోకి పట్టి పట్టి చూస్తూ మంచం దిగి, లేచి నించుంది వల్లి.

భారాన్నంతనూ తన భుజాలమీదనే మోస్తున్నట్లు బరువుగా నిట్టూరుస్తూ కదిలింది వసంత. వర్షం కురిసే ముందు ఆకాశంలా ఉంది ఆమె వదనం.

'ఇలాంటి ప్రసంగం, 'ఇంతమేరకు' అని ఇదమిత్థంగా అంచనామాత్రం వేసుకోలేకపోయింది వల్లి.

వేళ్ల కిందినుంచి లాక్కున్న చీరచెరగుతో రెండు కళ్లనూ ఒత్తుకుంటూ వెళ్లి, కుంకుమ భరిణ పట్టుకు వచ్చి, వల్లి భ్రుకుటిన ఉన్న బొట్టుమీద బొట్టును దిద్దింది వసంత.

"వీలుచేసుకుని ఓసారి అలా మా ఇంటికేసి రావే, వసంతా!" గది గుమ్మం దాటుతూ అంది వల్లి.

"అలాగే లేవే. రేపో ఎప్పుడో వస్తాన్లే." ఎక్కడో పాతాళలోకాలనుంచి వస్తున్నట్లుంది ఆమె మాట.

గుమ్మందాకా సాగనంపి వచ్చి, బరువెక్కిన గుండెలో గదిలో మంచంమీద వెనుగాలికి వేళ్లతో ఊడి పడి పోయిన వృక్షంలా పడిపోయింది వసంత!

* * *

మెతుకులు నోటికి ఏవో ఇన్ని మెతుకులు కతికి, వెళ్లి మంచంమీద పడుకుని, పాదాలదగ్గరనించి పీకల్దాకా రగ్గు కప్పుకుని, తలదగ్గర ఉన్న టేబిల్ లైటును వేసి, 'ది గ్రేప్స్ ఆఫ్ రాత్' (జాన్ స్టీన్‌బెక్ నవల) తీసి చదవ నారంభించింది వసంత.

ఒకటో పేజీ . . . రెండో పేజీ . . . పదో పేజీ . . .

పుస్తకంమీద దొర్లే రైలుచక్రాల్లా పంక్తుల వెంట కళ్లు దొర్లుతూ ఉన్నాయి.

పేజీ పేజీల తరవాత పేజీలను తిప్పుతూనే ఉన్నాయి.

వందకు పైగా పుటలు తిరిగాయి. కాని, పుటలలోని విషయం మాత్రం పుటలు దాటి పైకి రావటంలేదు.

"ప్చ్!" పుస్తకం మూసిపారేసి, లైటు ఆర్పి, కళ్లు మూసుకు పడుకుంది.

మూసుకున్న కళ్లు తెరుచుకునేఉన్నాయి.

"ప్చ్!" కప్పుకున్న రగ్గు విసిపారేసి, లేచి గదిలో అటూ ఇటూ పచార్లు చేయ నారంభించింది.

పచ్చిమీద ఉన్న రిస్టువాచీలోని ముళ్లు తనతో పోటీగా తిరుగుతున్నాయి.

రోడ్డుమీద రెండో ఆట సినిమాకు వెళ్లిన జనం ఏవేవో కబుర్లు చెప్పుకుంటూ వెళ్తున్నారు.

వసంతకు కాళ్లు పీకాయి.

కళ్లు సొలసాయి.

ఒళ్లు అలిసింది.

'ప్చ్!' 'ఏమిటో ఈ రోగం? నెల్లాళ్లనుంచి ఇదే వరస! . . .'

కంటికి కునుకు రాదు.

నోటికి మెతుకు పోదు.

మనసుకి నిలకడ లేదు!

అర్థంకాని అస్థిరత్వం ఏదో ఎప్పుడూ మనసును ఆవహించుకు తిరుగుతూంది.

ఫలానా అని చెప్పలేనిదానిచుట్టూ ఊహల్లాంటి వేవో ఈగల్లా ముసురుకుంటున్నాయి.

ఏదో కావాలనిపిస్తూంటుంది ఎప్పుడూ. కాని, అదేమిటో తెలీదు!

జీవితానికి ఏదో పెద్ద లోటు. ఒంట్లో అర్థంకాని తహతహ! మనసులో అనిర్వచనీయమైన ఆరాటం!

ఆ లోటు ఏమిటో? . . . ఆ తహతహ ఎందుకో?... ఆ ఆరాటం ఎందుకోసమో? . . . తనకు తెలీదు.

ఎప్పుడు చూసినా అమూల్యమైన వస్తువు నేదో పోగొట్టుకున్నట్లూ, దానికోసం అన్వేషిస్తున్నట్లూ అనిపిస్తూంది.

తన శరీరంలో అణువంత వేదో ఎక్కడో పుట్టి, ఒళ్లంతా ముమ్మరంగా వ్యాపించి, తన నెక్కడా నిలవ నీయటంలేదు.

ఎక్కణ్ణించో, ఎవరో తనను నిర్విరామంగా ఎక్కడికో తరుముతున్నారు.

భారరహితమైన స్థితిలో ఊపిరాడకుండగా అటు పైకి పోక, ఇటు కిందికి పడక, మధ్యస్థంగా ఎక్కడో ఏమీ లేనిచోట నిరాధారంగా వేళ్లాడుతూన్నట్లు అనిపిస్తూంది!

ఇముడ్చుకోలేనంత గాలిని కొట్టేసిన రబ్బర్‌బెలూన్‌లా నిండుగా, ఒత్తిడితో పేలిపోవటానికి సిద్ధంగా ఉన్నట్లు అనిపిస్తూంటుందెప్పుడూ!

తెలీని వెలితి ఏదో తన అఖాతాల లోతుల్లోకి తనను రెక్కపట్టుకుని లాక్కుపోతూన్నట్లు అనిపిస్తూ ఉంటుంది.

అనంతమైన శూన్యంలోకి తనను ఉండలా చుట్టి, బంతిలా విసిరేస్తున్నట్లు భయమేస్తూంటుంది.

ఆ అనిపించటాలకు . . . ఓ ఆకారం లేదు. ఒళ్లుకు తగిలి, పోయే గాలి లాంటివి! ఓ క్రమం లేదు. నాటి ఇష్టం! ఎక్కడో మొదలవుతాయి. ఎన్ని మలుపులో తిరుగుతాయి. ఆఖరికి ఎటో పోతాయి.

ఇదమిత్థంగా 'ఇదీ' అని చెప్పుకోలేని స్థితి అది!

"మందులేని రుగ్మత నీది!"

"అవును . . . చేజేతులా తెచ్చిపెట్టుకున్నావు! అనుభవించు!"

గదిలో ఏ మూలనుంచో రెండు స్వరాలు కాళీన్నాన్ని ఒంపుతున్నాయ్.

"ఎవరది?" గదిఅంతా కలయజూసింది.

"నే . . . నే!"

నా పేరు వెలితి! . . .

దీని పేరు శూన్యం! . . .

ఇద్దరం అక్కచెల్లెళ్లం!"

ఒకరి మొహంలోకి ఒకరు చూసుకుంటూ విరగబడి ఒక్కపెట్టున వికటాట్టహాసం!

"అబ్బబ్బబ్బ!. . . చెవులు చిల్లులు పడిపోతున్నాయి. ఏమిటా వెర్రినవ్వులు? . . . ఆపండి!"

చెవి గూబల్లో వేళ్లు దూర్చుకుని వసంత గర్జింపు!

"మేం నవ్వులు ఆపుతాంకానీ, . . . నవ్వుల పాలయ్యే నీ జీవితాన్ని నవ్వులపాలు కాకుండా ఆపుకో గలవా అని?"

నెత్తి నరాలే!

"కి కి . . . కి . . . కి . . . కి . . .!" శూన్యం అందుకుంది.

"ఇంత చిన్న గాలివానకే తట్టుకోలేకపోతున్నావు! ఇక, ముందున్న పెనుతుఫానుకు ఏం నిలవొక్కుకుంటా? . . .

అన్నీ ఉడిగిన అవ్వపురాదు నువ్వు! ఎన్నో ఉన్న జవ్వనివి!

చన్నీళ్లస్నానం, చప్పిడి చేసినంతమాత్రాన చల్లబడి పోయేదికాదు యౌవనం!

రైలింజన్‌లోని రాక్షస బొగ్గు మంటల్లాంటి దది! ఆ మంటలను నువ్వు భరించలేవు. ఆ వేడి నిన్ను కుత కుతలాడించి పిచ్చెక్కిస్తుంది! నీచేత వెర్రిపరుగులు తీయిస్తుంది.

పట్టాలు తప్పుతావు!

పడి, పక్కీలు కొడతావు!

పడిపోయిన నీమీద జాలిపడదం ప్రపంచానికి కింకా చేతకాదు.

నిన్నెవరూ లేవనెత్తరు సరికదా, అంతా నిన్ను తొక్కుకుంటూ పోతారు.

ఇది ప్రపంచం. నీ కన్నీరు, మంచిచెడ్డలు దాని కక్కర్లేదు. నిన్ను అనరాని మాటలన్నీ అంటుంది. కూయరాని కూతలన్నీ కూస్తుంది. హీనాతిహీనంగా చూస్తుంది నిన్ను.

నీ తనువు మనసు కుళ్లిపోతాయి. నీమీద నీకే అసహ్యం వేస్తుంది. నీ దుర్గంధం, రోత నీకే భరించ రాని వవుతాయి. కాని, ఇప్పు డింకెక్కడికీ పరుగెత్తి పోలేవు. ఆ రోతలోనే ఆఖరైపోతావు.

మనిషి జన్మ ఎత్తి, ఇలాంటి క్రిమికీటకాల బ్రతుకు బ్రతుకుతావా? హేయం, వసంతా, హేయం!"

వసంత గుండెల్లో మెరుపుల తళతళలు! ఉరుముల ఫెళఫెళలు!


ఏజంట్లు కావలెను

అంతా స్త్రీలచే నిర్వహించబడే "శ్రీమతి" స్త్రీల సచిత్ర మాసపత్రికకు

ఏజంట్లులేని ప్రాంతాలలో ఏజంట్లకు దరఖాస్తులు కోరబడుచున్నవి.

ప్రారంభ సంచిక రిపబ్లిక్-డే సంచికగా $\frac{1}{4}$ డెమ్మీ సైజులో సుమారు 100 పేజీలతో, వెల రూపాయితో ముచ్చటగా ముస్తాబై జనవరిలో విడుదల కాగలదు.

ఇతర వివరములకు:

మేనేజర్, "శ్రీమతి", విజయవాడ-2.

తుఫానులో వృక్షతతిలా ఊగిసలాడిపోయింది.

"బాల్యే పితుర్వశే తిష్ఠేత్. . . న భజేత్ స్త్రీ స్వతంత్రతాం!"

"వెళ్ళు . . . వసంతా, వెళ్ళు! . . . ఇప్పటికైనా నా మాట విను. నీ స్థానం ఎప్పటికీ నీకు కాకుండా పోదు. నీ చోటులో నువ్వు చేరి, రసవిహీనమైన నీ జీవితాన్ని మళ్ళీ రసమయం చేసుకో! . . . వెళ్ళు, వసంతా! . . . వెళ్ళు! . . ."

'వెళ్ళు! . . . వెళ్ళు! . . . వెళ్ళు! . . .' గది నిండా ఎక్కడ చూసినా వల్లి ప్రతిరూపాలే. ఎటుతిరిగి విన్నా, చెవులు చిల్లులు పడిపోయేలా "వెళ్ళు!" ప్రతిధ్వనులే.

"వెడతాను, వల్లీ! . . . వెడతాను. . . ఈ ఒంటరితనాన్ని నేనింక భరించలేను. ఈ తాపాన్ని నేనింక ఓపలేను. . .

వెళ్ళి ఆయన పాదాలమీద పడతాను. ఆశ్రయం ఇమ్మని వేడుకుంటాను. వారు ఆర్ద్రహృదయులు. ఆ హృదయంలో నాకు ఎప్పటికీ చోటు ఉంటుంది."

* * *

బర్‌ఖాత్‌పురా చమన్‌దగ్గిర బస్సు దిగి, పది అడుగులు వేసింది.

'మళ్ళీ ఎన్నాళ్ళకు!'

తనకు కావాలనుకున్నచోటు అల్లంత దూరంలో కనిపించేసరికి, ఒక్కసారి వసంతలో ఏదో ఓ కొత్త ఉత్సాహం ఉప్పెనలా పొంగుకొచ్చింది.

పెద్దపెద్ద అంగలు వేసుకుంటూ నడవనారంభించింది.

"ఆగు! . . . ఎక్కడికి?"

ఒక్కసారిగా ఉలిక్కిపడేలా గద్దించి, వెనకనుంచి ఎవరో తనను రెక్కలు పట్టుకుని బలంగా గుంజినట్లనిపించింది వసంతకు. తనకు తెలీకుండగానే అడుగుల వేగం మందగించింది.

"నువ్వెవరవు నన్నాపటానికి? . . . నేను నా ఇంటికి వెళుతున్నాను." గుడ్డురిమింది వసంత.

"నీ ఇ . . . ల్లా!" వెనకనుంచి వికటాట్టహాసం.

"అ . . . వు . . . ను . . ."

"పి . . . చ్చి . . . దా . . . నా . . . ఏదో వెర్రిభ్రమలో పడి, విజ్ఞతను కోల్పోతున్నావు. . .

దేన్ని 'ఇది నా ఇల్లు!' అని అనుకుంటున్నావో, అది నీది కాదు. అందులో నీకు చోటులేదిప్పుడు. నీఉండే చోటులో . . . నీ చేతులతోనే . . . ధర్మాన్ని ప్రతిష్ఠించేసి వెళ్ళిపోయావు ఆనాడు. ఆ ధర్మాన్ని కాదని అందులో అడుగు పెట్టలేవు ఇప్పుడు. ఆ ధర్మం నీకు చాలా పవిత్రమైనది. దాని రక్షణ నీకు ప్రాణాధికమైనది. ఆ చోటుమీద నీకు అమితమైన పూజ్యభావం, అపారమైన గౌరవం ఉన్నాయి. వాటిని మైలపరుస్తావా? వాటికి కళంకాన్ని ఆపాదిస్తావా? ఆలోచించుకో, వసంతా! ఆలోచించుకో!

మనిషిగా జన్మ ఎత్తినంతమాత్రాన సరిపోలేదు. మనిషిగా బ్రతకగలగాలి. అప్పుడే ఉత్కృష్టమైన ఆ జన్మకు సాఫల్యం సిద్ధించేది. మనిషి జీవితం సార్థకం అయ్యేది.

ఈ ధ్యేయానికి మార్గం ధర్మం. ధర్మం మన మనుగడకు జీవగఱ్ఱ! అది మన తప్పుల్ని దిద్దుతుంది. మన వంకర్లను సరిచేస్తుంది. ఒక ఉన్నతమైన జీవన సరళికి మనలో చోదనశక్తి అయి మనలను నడిపిస్తుంది.

ఈ ధర్మంకోసం ఎందరెందరో ఎన్నెన్నో త్యాగాలు చేసి, మహానుభావులై మనకు ఆదర్శప్రాయులయ్యారు నేడు.

వాళ్ల నందర్నీ మనం 'దేవుళ్ళు' అంటున్నాం. వాళ్లకు గుళవా గోపురాలూ కట్టించి కొలుస్తున్నాం. వాళ్ల విగ్రహాలకు చేతులెత్తి మొక్కుతున్నాం.

వాళ్ళు దేవుళ్ళు కాదు. నీలాంటి, నాలాంటి మామూలు మనుషులే. దేవుడనేవాడు వేరేగా లేడు. ప్రతీ మనిషీ ఒక దేవుడు! ప్రతి ఇల్లూ ఒక గుడి!

మనం చేతులెత్తి మొక్కుతూన్నది దేవుళ్ల ప్రతిమలకు కాదు, ధర్మప్రతీకలకు!

మనం స్తోత్రం చేస్తున్నది వాళ్ల పేర్లనుకాదు, వాళ్ల ధర్మప్రవృత్తులను!

ధర్మచ్యుతుడు కానివాడు ప్రతివాడూ దేవుడే! అతడు ధర్మపథంలో తీసి, వేసిన అడుగుజాడలే ఒక మతం!

బుద్ధుడెవరు?

బౌద్ధమతం ఏమిటి?

క్షత్రియ కుమారుడైన సిద్ధార్థుడు బుద్ధదేవుడెలా అయ్యాడు?

రేపు నువ్వూ దేవత వవుతావు! . . . నీ పేరటా ఓ మతం వ్యాప్తిచెందుతుంది!

ఏ యుగంలో, ఏ మనిషి, ఏ దేవుడైనా, ఎవరిపేరిట ఏ మతం వ్యాపించినా ధర్మం కడుపులోంచే! ఆ ధర్మం ఒక్కటే.

మంచిని పెంచుకుని మనిషిగా బ్రతుకు!

మానవత్వాన్ని నింపుకుని, మాధవుడిగా మారు! అని బోధించే మహత్తర సత్యం!

ఈ సత్యాన్ని మరిచిపోకు, వసంతా!"

వసంత ఒళ్లంతా నఖశిఖపర్యంతం విద్యుత్తులాంటిదేదో ఒక్కసారిగా ప్రసరించినట్లయింది!

గగుర్పాటుచెంది, రెండుకళ్ళూ ఓసారి నులుముకుంది.

కటికచీకటిలోంచి ఒక్కసారిగా కళ్ళు చిల్లులుపడే వెలుగులోకి కాలు పెట్టినట్లనిపించింది!

'అవును. ఏ ధర్మంకోసం ఆయనకు ఆనాడు దూరమైపోయానో, ఆ ధర్మానికే . . . ఏదో అజ్ఞాన తిమిరంలో పడి . . . అన్యాయం చెయ్యబోయాను. కళంకాన్ని ఆపాదించబోయాను. . .

తగని ఆవేశంలో, కూడనిచోట కాలూనబోయి, తీరని అపచారం చెయ్యబోయాను.'

వచ్చిన దారివైపు తిరగబోతూ, అల్లంత దూరంలో ఊపిరిని స్తంభింపజేసే ఆ దృశ్యాన్ని చూసి, కాళ్ళూ చేతులూ ఆడక క్షణంపాటు స్థాణువులా అలాగే నించుండిపోయింది వసంత.

ఎవరి పిల్లవాడో, పదినెలలవాడు . . . ఎర్రగా బొద్దుగా ముద్దొస్తూ ఉన్నాడు. చిన్న చడ్డీలాంటిది పచ్చపువ్వు లున్నది, తొడుక్కున్నాడు. బుల్లి పాదాలకు లేత గులాబీరంగు మేజోళ్ళు తొడుక్కున్నాడు. . . రోడ్డుకి అడ్డంగా పడుతూ లేస్తూ పాకుతున్నాడు.

అప్పుడే రోడ్డు మలుపు తిరిగిన లారీ ఒకటి ఆ ప్రాకుతూన్న కుర్రాడివైపు దూసుకువస్తూంది.

వసంతకు దడ పట్టుకుంది. ఒళ్లంతా ముచ్చెమటలు పోసేశాయి.

కుర్రాణ్ణి చూసినట్లులేదు డ్రైవరు. పక్కవాడితో కబుర్లు చెబుతూ, మధ్య మధ్య ఏదో పరధ్యాన్నంగా రోడ్డువైపు ఓసారి తల తిప్పి చూస్తూ, ఇంకా అదే వేగంతో దూసుకువచ్చేస్తున్నాడు. ఇంకెంతో దూరం లేదు లారీ.

పొట్ట నేలమీద ఆనేలా పడిపోయి, మళ్ళీ లేచి అమాయికంగా పాకుతున్నాడు కుర్రాడు.

భయాందోళనలతో వసంతకు కాళ్ళూ చేతులూ

## గాంధీజీ సూక్తులు



### అస్పృశ్యులు

"సాంఘికంగా అస్పృశ్యులు కుష్ఠురోగులు; ఆర్థికంగా వారిది అంతకంటె అధ్వాన్నస్థితి; మతపరంగా చూస్తే మనం తప్పుగా పేరుపెట్టుకుని పిలుస్తున్న దేవుని ఆలయాల్లోకి వారికి ప్రవేశం లేదు. అస్పృశ్యతను నిర్మూలించనిపక్షంలో మనం భూమిమీదనుంచే నిర్మూలించబడతాము."

✱ ఇది గాంధీజీ శతజయంతి సంవత్సరం ✱

## హిందీ తెలుగు స్వబోధిని

హిందీభాషను అతి సులభముగా 30 దినములలో నేర్చుకొనవచ్చును. ఇందులో హిందీ పదములకు తెలుగు అర్థములు, తెలుగు పదములకు హిందీ అర్థములు నేర్చుకొనుటకు సులభముగా వ్రాయబడినది. ఇందులో కథలు, వ్యాసములు, వ్యాకరణము, ఉత్తరములు వ్రాయుపద్ధతి మున్నగు విషయములు కలవు. వెల: రూ 2—25. పోస్టేజి వేరు.

**బాలసరస్వతీ బుక్ డిపో,**
మద్రాసు - 1

SWASTIK








## ఎలెక్ట్రిక్ అండ్ రేడియో ఇంజనీరింగ్ కోర్సు

ఎలెక్ట్రికల్ ఇంజనీరింగ్, రేడియో రిపేరింగ్, ఎస్సెంబ్లింగ్, ఎలెక్ట్రికల్ సూపర్వైజరీ, వైరింగ్ వగైరాయొక్క పూర్తి గైడు. (800 చిత్రపటములు.) రు. 12—50 వి.పి పోస్టేజి రు 2/-.

**Sulekha Book Depot (E)**
Aligarh



ఉచితము ! ఉచితము !

## తెల్లమచ్చలు

మా ప్రఖ్యాతివహించిన డాగ్‌నాశా ప్రత్యేక ఔషధము తెల మచ్చలను సులభముగ పోగొట్టుటలో 1925 సం నుండి ప్రఖ్యాతి వహించి యున్నది మూడు రోజులు వాడినంతనే మచ్చల తెలుపుతనం కొన్ని రోజులలో సమూలంగా నాశనము చేయగల శక్తి కలిగియున్నది ఉచితంగా ఒక పాకెట్ మందు యివ్వబడును నకలును చూచి మోసపోకండి.

WESTERN INDIA CO. (V.N.)
P.O. Katrisarai (GAYA)



## ఇంకా పొడుగు ఎదగండి



నూతన శాస్త్ర పద్ధతులలో వ్యాయామములతో ఎక్కువ పొడుగు కండి. ఆరోగ్యవంతులవండి. స్త్రీ పురుషులకు ఎల్లరకు అనువైనవి దీని వంటి కోర్సు, లేక పుస్తకం మరొకటి ఎంతమాత్రంలేదు. వివరములు ఇంగ్లీషులోగాని తెలుగులోగాని ఉచితం.

**TOTAL HEALTH,**
**283, Azad Market (AVP), Delhi-6.**



## ఋతుక్రమం ఆలస్యమైతే?

విచారపడవద్దు ప్రఖ్యాతిగాంచిన దేవిపిల్సు వాడండి

పూర్తికోర్సు ప్యాకెట్టు 28 మాత్రలు వెల రు.
సగం కోర్సు ప్యాకెట్టు 14 మాత్రలు వెల రు. బిళ్ల ఖర్చు అదనము ప్రతిచోట దొరకును



దేవి పిల్సు ముఖ్యంగా అలస్యమైన క్రమముగాకాక పోయిన, బాధతో కూడిన, లేక ఆగిపోయిన బహిష్టుకు దేవిపిల్సు బాగుగ గుణమిచ్చును

1 అన్ని సందర్భములలోను శీఘ్రముగాను, అమోఘము గాను పనిచేయును
2 ఏస్థితిలోను ఆరోగ్యమునకు ఎట్టిహాని కలిగింపదు

Mfrs.- SEENU & CO. MADRAS-21

పెద్ద కెమిస్టులు దగ్గిరను అందరి వద్దను లభిస్తున్నది
ప్రకటన G. O. Ms. No. 1121 క్రింద అనుమతించబడినది


ఆడలేదు. ఎప్పుడూ ఎరగని నీరసం ఏదో ఒక్కసారిగా తనను ఆవహించింది.

కనురెప్పపాటులో . . . ఆ రాక్షస చక్రాలకింద పడి, చుట్టూ ఇంత రక్తాన్ని చిమ్మి . . . ఆ ముద్దుల మూడు పిడికెడు మాంసపు ముద్దగా మారిపోతాడు!...

ఏ తల్లి కనుపాపల దీపకళికో! . . . ఏ మాతృ హృదయానికి స్పందనమో! . . . ఆ భయంకర దృశ్యాన్ని చూసి, గర్భశోకాన్ని భరించలేక ఆ తల్లి ఏమైపోతుందో!'

వేగానికి కనిపించకుండగా దొర్లుతూన్న చక్రాలు ఆ పసికందును కబళించబోతున్నాయి.

ఏ దేవు డిచ్చాడో ఆ కాళ్లకా శక్తి! ... ఏ ధర్మం బోధించిందో ఆ కర్తవ్యం!

చేతిలో పొట్లాన్ని గద్ద తన్నుకుపోయినట్లు . . . అంతా కనురెప్పపాటు!

కీచుమని పెద్ద ధ్వని చేసుకుంటూ, అష్టవంకరలు తిరిగి, రోడ్డుకి అడ్డంగా అస్తవ్యస్తంగా ఆగింది లారీ. చక్రాలకు ప్రక్కన చేరువలో రక్తపు మడుగు!

మడుగులో ధర్మం మిగిలింది!

చుట్టూ జనం మూగారు.

"రామ్! . . . మేరా బేటా రామ్!" గుండెలు బాదుకుంటూ ఓ యువతి. "బాబూ! . . . బాబూ!" భయాందోళనలతో ఆమె వెనకాలే ఆమె భర్త — ఇంట్లోంచి ఇద్దరూ ఉరుక్కుంటూ వచ్చి, మూగిన జనాన్ని తోసుకుంటూ ముందుకి వచ్చారు.

"వ . . . సం . . . తా!" పార్థసారథి గుండెలు బ్రద్దలయ్యాయి. చిల్లులు పడిన గుడ్లల్లోకి నీళ్లు చిమ్ముకొచ్చాయ్. అశ్రుపూరితాలైన అతని నేత్రాలకు అలుక్కుపోయినట్లు కనిపిస్తూంది ఆమె రూపం.

భారంగా ముందుకి అడుగు వేసి, ఆమె తలదగ్గిర కూర్చుని, ఆమె శిరస్సును తన తొడమీద ఉంచుకున్నాడు. ఆమె చేతిని తీసుకుని తన రెండుకళ్లకూ అద్దుకున్నాడు.

'ఎవరీమె? . . .' కనుబొమలు ముడిపెట్టి స్వగతంగా అనుకుంది వహీదా.

"ను...వ్వు గు...ర్తు ప ... ట్ట ... లే ... దా, వ...హీ...దా?" పెగలని పార్థసారథి గొంతులోంచి ఒక్కొక్క మాటా తెగి, బరువుగా వస్తూంది.

"ఆ నాడు . . .

నీ కడుపున బడ్డ కవలలు రామ్, రహీంలకు బాధ్యుడై నీకు నమ్మకద్రోహం చేసిన పురుషుణ్ణే నీ కప్పగించి వెళ్లిపోయింది! . . .

ఈనాడు . . . నీ బిడ్డను నీ కప్పగించి, శాశ్వతంగా వెళ్లిపోయింది! . . .

తాను కాలిపోతూ నీకు కాంతి నిచ్చింది.

మతాలు వేరైనా, ధర్మం ఒక్కటే అన్న మహత్తర సత్యాన్ని మనకు నేర్పింది!"

' . . . . . . . . .

. . . . . . . . .

ఈశ్వర్ అల్లా తేరే నామ్ . . .

సబ్‌కో సన్మతి దే భగవాన్! . . '

పూజ్య బాపూజీ ప్రియగీతక వస్సగా, తియ్యగా ఎక్కణ్ణించో వినిపిస్తూంది! ★